క్లుప్తంగా

గాయత్రీమాత రథోత్సవం



పూజలందుకుంటున్న గాయత్రీమాత

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరి వాణం గ్రామంలో వెలిసిన శ్రీ నవనాగ గణపతి సమేత మానస గాయత్రీ దేవా లయంలో గురువారం 49వ వార్షిక రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఐదు రోజులపాటు ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గరుడాద్రి సుబ్రహ్మణ్య శాస్త్రి తెలిపారు. ఉదయం నవనాగ గణపతికి, శ్రీమానస గాయత్రీ అమ్మవారికి నర్మదానది తీర్థంతో విశేష ద్రవ్యములతో అభిషేకాలు, గణపతిహోమం, అరుణహోమం, చండీహోమం నిర్వహించారు. సాయంత్రం భక్తులు జయజయ ధ్వనుల మధ్య రథాన్ని లాగారు. భక్తులకు అన్నదానం చేశారు.

అక్రమ కట్టడాలను కూల్చేస్తాం



ఆర్టీసీ కాలనీలో అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, టీపీఓ

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నిర్మితమవుతున్న ఇళ్ల నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి పరిశీలించారు. మున్సిపల్ శాఖ నిబంధనల మేరకే ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని యజమానులకు సూచించారు. అక్రమ కట్టడాలు చేపట్టినట్లయితే కూల్చేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఆయన వెంట టీపీఓ శ్రీనివాసులు ఉన్నారు.

ఆదోనిలో హెబ్బా పటేల్ సందడి



అభివాదం చేస్తున్న సినీ నటి హెబ్బా పటేల్

ఆదోని టౌన్: పట్టణంలో ఏర్పాటు చేసిన ఓ వస్త్రదుకాణ ఎగ్జిబిషన్‌ను సినీ నటి హెబ్బా పటేల్ గురువారం ప్రారంభించారు. విషయం తెలుసుకుని అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన తర్వాత హెబ్బా పటేల్ మాట్లాడి అభిమానుల్లో ఉత్సాహం నింపారు. నిర్వాహకులు డాక్టర్ విట్టా సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ద్రావణాన్ని చూపుతున్న సెబ్ సీఐ భార్గవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మాధవరం తాండ దగ్గర గురువారం సాయంత్రం బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. మాధవరం తాండ సమీపంలో బెల్లం ఊట ఉన్నట్లు సమాచారం రావటంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి ప్లాస్టిక్ బిందెల్లో ఉంచిన 180 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఆ ప్రాంతంలో బెల్లం ఊటను ఎవరు ఉంచారో విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో హెచ్‌సీ గోపాల్, లింగప్రసాద్, పీసీ భరత్, నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని నందవరం మండలంలో రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి గురువారం సాయంత్రం తెలిపారు. నందవరం మండలం నదికైరవాడిలో ఒకటి, పెద్దకొత్తిళి దగ్గర ఒక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ చెప్పారు. అనుమతి లేకుండా అక్రమంగా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండడంతో ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 10 వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

నేటి నుంచి సబ్సిడీ విత్తనాల పంపిణీ

కోసిగి: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి రాజు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. కోసిగి మండలానికి 210 క్వింటాళ్ల వేరుశనగ, 10 క్వింటాళ్ల జీలుగ, 2 క్వింటాళ్ల పిల్లిపెసర మంజూరైనట్లు తెలపారు. వేరుశనగ క్వింటం ధర మార్కెట్‌లో రూ.9300 కాగా సబ్సిడీ రూ.3800 పోనూ, రైతుకు రూ.5700కే లభిస్తోందన్నారు. రైతుకు ఎకరాకు 2బస్తాలు చొప్పున గరిష్టంగా 3 బస్తాలు అందిస్తారని చెప్పారు. రైతులు పొలం పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకెళ్లి ఆర్బీకేలో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గడువు దాటిన సిలిండర్‌తో జాగ్రత్త

- అప్రమత్తతతో ప్రమాదాలు దూరం
- గడువు తేదీపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలతో గృహిణులకు లాభం
- గడువు తేదీపై అవగాహన కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫలం



గ్యాస్ సిలిండర్‌పై కోడ్ రూపంలో ముద్రించిన గడువు తేదీ

ఆదోని అర్బన్: నిత్యావసరాలుగా వినియోగించే ప్రతి వస్తువుకు గడువు తేదీ ఉంటుంది. వంటగ్యాస్ సిలిండర్‌కు కూడా ఇది వర్తిస్తుంది. కాలం చెల్లిన గ్యాస్ సిలిండర్ వినియోగించడం ప్రమాదకరం. వినియోగదారులు దీనిపై అవగాహన పెంచుకుంటే ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది. గడువు తేదీపై అవగాహన కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫలమవుతున్నారు. పట్టణంలో, గ్రామాల్లో రెవెన్యూ అధికారులు గడువు తేదీపై అవగాహన కల్పించినట్లు దాఖలాలే లేవు. దీంతో ప్రజలకు గ్యాస్ సిలిండర్ గడువు తేదీపై అవగాహన లేకపోవడంతో కొన్నిచోట్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.

గడువు తీరితే ప్రమాదమే

గ్యాస్ సిలిండర్‌ను నెలల తరబడి వాడకుండా నిల్వ ఉంచుతారు. మరింత మంది బ్లాక్‌లో కొని వాడతారు. అయితే సిలిండర్‌పై ముద్రించిన గడువు తేదీ లోపు వాడితే ఉత్తమం. కాలం చెల్లిన సిలిండర్‌లను వాడితే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిని సంబంధిత డీలర్లకు తిరిగి ఇచ్చేయాలి.

ముగింపు తేదీని ఇలా గుర్తించాలి....

ప్రతి ఇంట్లో వంట చేసేందుకు గ్యాస్ సిలిండర్ వాడకం తప్పనిసరిగా మారింది. ఏజెన్సీ నుంచి గ్యాస్ సిలిండర్ డెలివరీ తీసుకోగానే గడువు తేదీని గుర్తించాలి. రింగుకు కింది భాగంలో గడువు తేదీ ముద్రించి ఉంటుంది. ఏడాదిలోని 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ఆంగ్లభాషలోని ఏ, బీ, సీ, డీ అక్షరాలను రాసి ఉంచుతారు. అక్షరం ఏ- అయితే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించినది. అక్షరం బీ- అయితే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించినది. అక్షరం సి- అయితే జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు, డీ- అయితే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంబంధించినదిగా గుర్తించాల్సి ఉంటుంది. సిలిండర్‌పై డి అని ముద్రించి ఉంటే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెల వరకే వినియోగించాలని అర్థం. ఆ నెలలు దాటితే సిలిండర్ కాలం చెల్లిందని తెలుసుకుని దూరంగా పెట్టాలి. ఖాళీ సిలిండర్‌కు నిర్దిష్ట కాల పరిమితి ఉంటుంది. ఇది వినియోగదారులకు సంబంధం లేదు. తయారీదారులు తమ వద్ద రికార్డుల్లో లేని బ్యాచ్ నంబర్ల ప్రకారం ఏడేళ్లు దాటిన వాటిని వెనక్కు తెప్పించుకుని పరీక్షించి, నాణ్యత లేని వాటిని పక్కన పెట్టేస్తారు.

నియోజకవర్గంలో 90 వేలకు పైగా వంటగ్యాస్ కనెక్షన్లు

ఆదోని నియోజకవర్గంలో 4 గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. ఆ గ్యాస్ ఏజెన్సీల్లో దీపం పథకం కింద 28,230, పీఎం ఉజ్వల పథకం కింద 11,406, బీపీఎల్, సీఎస్ఆర్ పథకం కింద 24,071, జనరల్ వినియోగదారులు 49,414 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం మీద 90,495 గ్యాస్ కనెక్షన్లను పట్టణంలో వినియోగదారులు వాడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

గడువు తీరిన సిలిండర్‌ను వాడితే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లే. గ్యాస్ నిర్వాహకులు అదే పనిగా ఎక్స్‌పైరీ డేట్ (గడువు తేదీ) నిర్ణయించి సిలిండర్‌పై ఆంగ్ల అక్షరంతో రాసి పంపిణీ చేస్తారు. కొంతమంది ఇళ్లల్లో నెలల తరబడి వాడకుండా నిల్వ ఉంచుకోవడం, బ్లాక్‌లో కొని వాడుకోవడం చేస్తుంటారు. అలాంటప్పుడు ముఖ్యంగా గడువును చూసుకొని వాడాలి. ఒకవేళ అలానే వాడితే గడువు పూర్తయిన సిలిండర్ ఎక్కువ శాతం లీకేజీ అయ్యే ప్రమాదం ఉంది. పట్టణంలో గ్యాస్ సిలిండర్ వాడకం, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి.

– రామాంజనేయులు, అగ్నిమాపక అధికారి

తగిన జాగ్రత్తలు పాటించాలి

గృహ వినియోగదారులు, కమర్షియల్ సిలిండర్ వినియోగదారులు గ్యాస్ సిలిండర్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలి. ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. సిలిండర్‌పై ఉన్న గుర్తులను, ఆంగ్ల అక్షరాలను గుర్తించి, వాడకానికి పనికొస్తుందో లేదో నిర్ధారించుకోవాలి. తెలియకపోతే సరఫరా దారుడిని అడిగి తెలుసుకోవాలి. గ్యాస్ సిలిండర్ కొలతల్లో ఏవైనా తేడాలు ఉంటే తమకు ఫిర్యాదులు చేయవచ్చు.

– వలిబాషా, సీఎస్‌డీటీ, ఆదోని

నేటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఆదోని సెంట్రల్: నేటి నుంచి పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. ఇటీవల విడుదలైన పరీక్ష ఫలితాల్లో తప్పిపోయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలను రాయనున్నారని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి గురువారం తెలిపారు. పరీక్షలను రాసేందుకు ఆదోని డివిజన్‌లో 9915 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజులను చెల్లించి దరఖాస్తు చేసుకున్నారన్నారు. తప్పిపోయిన విద్యార్థులు పరీక్షలను రాసేందుకు డివిజన్‌లో 39 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదోని నియోజకవర్గంలో 2800 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరి 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, పురపాలక ఉన్నత పాఠశాల, నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల, నారాయణ పాఠశాల, నేషనల్ స్కూల్, సెయింట్ జోసఫ్ స్కూల్, భాష్యం పాఠశాలలో పరీక్షలు జరగనున్నాయన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా నేటి నుంచి జరగనున్నాయని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజన్న తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జయంతి





వెండి అలంకరణలో దర్శనమిస్తున్న చౌడేశ్వరిమాత, జ్యోతి మహోత్సవంలో కలశాలతో చిన్నారులు, మహిళలు

ఆదోని అర్బన్: పట్టణంలోని క్రాంతినగర్‌లో వెలిసిన చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తొగటవీర క్షత్రియసేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం నుంచి జ్యోతి మహోత్సవాలు జరుగుతున్నాయి. గురువారం వేకువజామున భక్తులు స్థానిక పేట వీరభద్రేశ్వరస్వామి దేవాలయం నుంచి జ్యోతులతో పురవీధులగుండా మహోత్సవం నిర్వహించారు. క్రాంతినగర్‌లో వెలిసిన చౌడేశ్వరి దేవాలయం వరకు జ్యోతులతో ఊరేగించారు. జ్యోతి మహోత్సవంలో చిన్నారులు, మహిళలు కలశాలతో ముందుకుసాగారు. డోలు, సన్నాయిల మధ్య భక్తులు జ్యోతిని మోసుకుంటూ చౌడేశ్వరిమాతకు జై అంటూ నామస్మరణతో చిందులు వేస్తూ క్రాంతినగర్‌లో ఆలయానికి చేరుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సంఘం పెద్దలు, కులస్తులు పాల్గొన్నారు.

క్షయ నివారణపై అవగాహన



ఆరోగ్య సూచనలు చేస్తున్న సూపర్‌వైజర్ బాబురాజు

ఆదోని టౌన్: దోమకాటు ప్రమాదకరమని ఆరోగ్య శాఖ సూపర్‌వైజర్ బాబురాజు పేర్కొన్నారు. ఆయన గురువారం పట్టణంలోని ఎస్కేడీ కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో క్షయవ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, గళ్లలో రక్తపుచారలు, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉన్నట్లయితే క్షయవ్యాధిగా గుర్తిస్తూ వైద్యసేవలు పొందాలన్నారు. క్షయవ్యాధి సోకిన వారికి ఆరు నెలలపాటు సరిపడా మందులను ప్రభుత్వం ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. పోషణకు నెలకు రూ.500 ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. దగ్గినా, తుమ్మినా చేయి అడ్డుగా పెట్టుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు బీసీజీ వ్యాక్సిన్ వేయించాలన్నారు. మాస్కులు ధరించాలని, మనిషి మనిషికి మధ్య రెండు మీటర్ల దూరం పాటించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయరాదన్నారు. ఉమ్మి వేస్తే మట్టి కప్పాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పొలం విషయంలో దాయాదుల ఘర్షణ



గాయపడిన చాకలి మద్దిలేటి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో పొలం విషయంలో గురువారం దాయాదుల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన చాకలి రామకృష్ణ, మద్దిలేటిలు చిన్నాన్నా, పెద్దనాన్న కుటుంబ సభ్యులు. కొంత కాలంగా ఇరు కుటుంబాల మధ్య పొలంలో పైపులు వేసే విషయంలో గొడవలు ఉన్నాయి. మద్దిలేటి తన పొలంలో వేసిన పైపులను రామకృష్ణ తొలగించాడు. ఈ స్థితిలో గురువారం మరోసారి మద్దిలేటి నీటి సరఫరా కోసం పొలంలో పైపులు వేసుకున్నాడు. ఈ పైపులను రామకృష్ణ తొలగిస్తుండగా మద్దిలేటి ఎందుకు తొలగిస్తున్నావని ప్రశ్నించడంతో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం ఏర్పడి ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో మద్దిలేటి, శేఖర్, వసుంధరకు గాయాలయ్యాయి. అలాగే చాకలి రామకృష్ణకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి ప్రభుత్వాసుపత్రికి చేరుకొని ఘర్షణకు గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. గాయపడ్డ చాకలి మద్దిలేటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామకృష్ణ, వెంకటేష్, కార్తీక్, పార్వతిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు. గాయపడ్డ వారికి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పీఠాధిపతికి సతీవియోగం



రత్నమ్మవ్వ (ఫైల్)

కోసిగి: మండల పరిధిలోని ఆర్లబండ అంబాభవాని దేవి ఆలయ పీఠాధిపతి సద్గురు శ్రీ మఠ్రిస్వాముల సతీమణి, అవధూత రత్నమ్మవ్వ (58) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆమె కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కర్ణాటక రాష్ట్రంలోని గంగావతిలో చికిత్స పొందుతోంది. కోలుకోలేక గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని ఆర్లబండ గ్రామానికి తీసుకొచ్చారు. గ్రామ శివారు నుంచే డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా కొండ మీద వెలసిన అంబభవాని దేవి ఆలయం చెంతకు తీసుకెళ్లారు. గ్రామం నుంచే గాక కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆమె భౌతికకాయానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీఠాధిపతి శ్రీమఠ్రి స్వాములను పరామర్శించారు. ఆమెకు ఒక కుమారుడు, కోడలు ఉన్నారు. ఆలయ వెనుక భాగంలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ మోహన్‌రెడ్డి

నందవరం: జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ రాజకీయ పార్టీ గెలిచినా, ఓడినా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో బాణసంచా కాల్చడం, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద జైలుకు పంపుతామని హెచ్చరించారు. అందరూ స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రమణీయం.. కోసిగయ్య మహారథోత్సవం



అశేష భక్తజనం మధ్య స్వామి వారి రథోత్సవం

కోసిగి: మండల ప్రజల ఆరాధ్య దైవం, భక్తుల కోర్కెలు తీర్చే శ్రీ ఆంజనేయ (కోసిగయ్య) స్వామి మహా రథోత్సవం గురువారం సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. వేకువ జాము నుంచి ఆలయంలో స్వామి వారికి ప్రధాన అర్చకులు శ్రీరాములు ఆధ్వర్యంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, వెండికవచ అలంకరణలు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం నుంచి వేదపండితులు జయతీర్థ ఆచార్, రఘునందన్ ఆచార్ సారథ్యంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను పల్లకీలో కొలువుంచి మేళతాళాలు, కలశాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా తేరుబజారు మైదానం వరకు వచ్చారు. అక్కడ సీతమ్మ కట్టపై కొలువుంచి వేదపండితులు సీతారాములస్వామి వారి నిశ్చయ తాంబులం అందజేసి నారికేలాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయం ప్రకారం మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ రాజు దొర ఇంటి నుంచి ఆయన వంశస్తులు మురళీ దొర, శ్రీనివాసరాజు దొర, సుందరరాజు దొర ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో ఊరేగింపుగా వచ్చి రథం వద్దకు చేరుకుని పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఉత్సవమూర్తులను రథంపై కొలువుంచి వేలాది మంది భక్తుల మధ్య స్వామి వారి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథావిధిగా గమ్యస్థానానికి చేర్చారు. భక్తులు అరటి, మామిడి పళ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. నూతన వధూవరూలు తలంబ్రాల నాటి వస్త్రాలు ధరించి రథత్సోవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.



ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తులకు అన్నదానం

స్థానిక తేరుబజారులో వెలసిన ఆంజనేయ స్వామి విగ్రహానికి చిన్నారులు కలశాలు, మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామి వారికి నైవేద్యం సమర్పించి, ప్రత్యేక హారతులు ఇచ్చి పూజలు చేపట్టారు. పౌర్ణమి, కోసిగయ్య స్వామి జాతరను పురస్కరించుకుని ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదానం చేశారు. ముందుగా గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం

గోనెగండ్ల: నేటి నుంచి జూన్ 3వ తేదీ వరకు జరిగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈఓ-2 నీలకంఠ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌లో పది సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్షలు రాసే విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. అలాగే పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని గోనెగండ్ల జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ సురేష్‌బాబు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గోనెగండ్లలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ఫస్ట్ ఇయర్ వారికి, మధ్యాహ్నం 2 నుంచి 5:30 గంటల వరకు సెకండ్ ఇయర్ వారికి పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

శ్రీమఠంలో మంత్రి ఉషాశ్రీ చరణ్



ప్రదక్షిణలు చేస్తున్న మంత్రి ఉషాశ్రీ చరణ్

మంత్రాలయం: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్ గురువారం మంత్రాలయం విచ్చేశారు. మఠం అసిస్టెంట్ మేనేజర్ నరసింహమూర్తి నేతృత్వంలో మఠం మర్యాదలతో ఆమెకు ఆహ్వానం పలికారు. ముందుగా ఆమె గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాసేపు మఠం ప్రాంగణ వీధుల్లో ప్రదక్షిణలు చేశారు.

సరదా.. సరదాగా !



మనవళ్లతో లూడో గేమ్ ఆడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

మంత్రాలయం: సార్వత్రిక ఎన్నికల వేళ.. ఇంటింటి ప్రచారం.. నాయకుల బుజ్జగింపులు.. చేరికలు.. పోలింగ్ సరళిపై ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు బిజీబిజీగా గడిపారు. నిద్రలేమి రాత్రులు సైతం అనుభవించారు. విజయావకాశాలపై బేరీజులు వేసుకున్నారు. ఇప్పుడిప్పుడే ఎన్నికల వాతావరణం నుంచి నాయకులు ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తన మనవళ్లతో లూడో గేమ్ ఆడుతూ సరదాగా గడిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి రథోత్సవం

పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి రథోత్సవం గ్రామస్తుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి, పుష్పాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతులు చేపట్టారు. గ్రామ ప్రజలు పిండి వంటలతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గొళ్ల నరసింహారెడ్డి ఇంటినుంచి కుంభాన్ని రథం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై ఉంచి అశేష భక్తజనం మధ్య శ్రీరామ నామం హోరెత్తగా రథోత్సవాన్ని ముందుకు కదిలించారు. రథాన్ని బసవన్న గుడి వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. జెడ్పీటీసీ రాజేశ్వరి, సర్పంచ్ అనసూయమ్మ, గ్రామ పెద్దలు జాము మూకయ్య, నారాయణరెడ్డి, మాదవరెడ్డి తదితరులు స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రథోత్సవం ముందు నందికోలు సేవలో తరిస్తున్న భక్తులు →



వైభవంగా అల్లీపీరాస్వాముల ఉరుసు



అల్లీపీరాస్వాముల సమాధులకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



పీఠాధిపతిని దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు



చలువ పందిళ్ల కింద సేదతీరుతున్న భక్తులు



భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఎమ్మిగనూరురూరల్: గుడేకల్ గ్రామంలో వెలసిన సద్గురు అల్లీపీరాస్వాముల ఉరుసు మహోత్సవం గురువారం మొదటి రోజు ఘనంగా జరిగింది. ఉత్సవాల్లో భాగంగా దర్గా పీఠాధిపతి ఘాజీహుసేన్‌పీరా స్వామి రాత్రి ప్రబోధనలు చేస్తారు. శుక్రవారం తెల్లవారుజామున గుడేకల్‌లోని ఇంటి నుంచి గంధంతో దర్గాకు చేరుకుంటారు. అనంతరం వేడుకలు ప్రారంభం అవుతాయి. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహరాష్ట్ర, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే దర్గా ఆవరణలో చలువ పందిళ్ళు, కుళాయిలు, వైద్య శిబిరం ఎర్పాటు చేశారు. లక్షకు మందికిపైగా భక్తులు ఉరుసులో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చేపట్టారు.